# సంపాదకీయము

సత్యపథము ప్రారంభించి ఈ దీపావళి నాటికి 13 ఏళ్ళు గడిచాయి. త్రైమాసికంగా నిరంతరాయంగా చదువరుల ఆశీర్వాదముతో పరిపూర్ణమయిన ఆధ్యాత్మిక సంచికగా తన కంటూ ఓ చోటు సాధకులమనస్సులో కల్పించుకోగలిగింది. అంతా మన గురుదేవుల ఆశీర్వాదఫలం. మొదట్లో ఆర్థికా భావమువలన ఈ పత్రిక చాల కొంచెము మూల్యమునకు అమ్మకంచేసినా, ఉదార హృదయముకల కొందరి అభ్యాసి సోదరీ సోదరుల సహాయంతో కొద్ది సంవత్సరములుగా ఉచితంగానే పంపిణీ చేయడం జరుగుతున్నది. అందువలన సాధకులందరూ సత్యపథమనే ఈ పత్రికను సద్వినియోగింప ప్రార్థన. దీపావళి యంటే నరకాసురుడూ, బాణాసంచాలు జ్ఞాపకమునకు వస్తాయి కాని, 16వేల స్త్రీలు చెఱనుంచి విడిపించబడిన విషయము జ్ఞప్తికి రాదు. జీవి స్వభావము పారతంత్ర్యము. దాని స్వాతంత్ర్యము భగవత్పార తంత్ర్యములోనే యుంది. 16వేల స్త్రీలు ఒక్కసారిగా శ్రీ కృష్ణ పరమాత్మని చేరినపుడు, అన్ని జీవాత్మలూ జ్యోతిరూపులై తమ గమ్యమును చేరు దృశ్యము నా దృష్టిలో ఒక అపురూపమైన ఆధ్యాత్మికానుభవము. ఆ సుందర జీవిత తారకమగు దృశ్యము మనకు గోచరించకయున్నా, అభ్యాసీ సోదరీ సోదరులు ఒక చోట చేరి పూజ్య బాబూజీ గారి మనో సామ్రాజ్యాన్ని చేరి నిరంతర మనో ఆనందాన్ని అనుభవించి నపుడు మనకు తత్తుల్యమయిన లయమనుభవమునకు వస్తుంది. సర్వం మధురమయి ఆ మధురానుభూతిలో ఒక్క పరతత్వంవినా ఏదీ ఎరుకలేని చైతన్యం, మన పాలిటి ఆధ్యాత్మిక గురువు, బంధువు, మిత్రుడూ, దైవమయిన పూజ్య బాబూజీ గారు తప్ప వేరెవ్వరూ మనకొసగలేరు. ఇది సాధకుల స్వానుభవము. పూజ్య బాబూజీ గారిపట్ల పారతంత్ర్యత అలవడనిదే అట్టి అనుభవము కలుగదు. భక్తి అంటే అదేదో మనంచేసే పూజ యని పలువురి నమ్మకము. భగవదనుగ్రహము లేక స్వప్రయత్న జన్యమగు భక్తి కూడా ఓ రకమైన భక్తి. భక్తి సద్గురు అనుగ్రహమువలననే గలిగినపుడు సాఫల్యత చెందుతుంది. అట్లే మనము గురు పారతంత్ర్యముగల వారమయి, గురుదేవుల అనుగ్రహము పొందినపుడే ఆశ్రితత్వము పొందిన వారమవుతాము. అటు తర్వాతే శరణాగతి. మన ఆధ్యాత్మిక సంపన్నతయంతా మనము భగవత్భోగ్యులమయినపుడే. ఆట్టి భోగ్యత్వమును పొందిన ఆనాటి శ్రీ కృపానుచరులయిన స్త్రీలూ, పూజ్య బాబూజీ గారి అనుచరులమయిన మనమూ ధన్యులమే.

*( దీపావళి సంచిక 2005 : 12-4)*